# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-10-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **కేంద్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యతనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **కేంద్ర జల్‌శక్తి శాఖ 2023 సంవత్సరానికి గానూ ప్రకటించిన 5వ జాతీయ జలపురస్కారాల్లో రాష్ట్రం నుంచి విశాఖపట్నం ఉత్తమ జిల్లాగా నిలిచింది.**
3. **అల్పపీడనం, భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఆరు జిల్లాల్లో సహాయ, పునరావాస చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.**
4. **ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన సిరిమానోత్సవం ఈరోజు జరగనుంది.**
5. **ప్రముఖ శాస్త్రవేత్త, పూర్వ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం జయంతి ఈరోజు.**

==========================

కేంద్ర ప్రభుత్వం ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యతనిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఢిల్లీలోని భారత మండపంలో ఈరోజు నిర్వహించిన 2024 అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్-ప్రపంచ టెలికమ్యూనికేషన్ ప్రామాణిక అసెంబ్లీ -డబ్ల్యుటిఎస్ఎ సమావేశాన్ని, 8వ విడత భారత మొబైల్ కాంగ్రెస్ 2024ను ప్రధాన మంత్రి ప్రారంభించారు. ప్రపంచ సవాళ్లను అధిగమించి పరస్పర సహకారాన్ని పెంపొందించడమే భారత్ ప్రాధాన్యత అని ప్రధానమంత్రి పేర్కొంటూ...

వాయిస్ (31 సెకన్లు)

--------------------------

కేంద్ర జల్‌శక్తి శాఖ 2023 సంవత్సరానికి గానూ ప్రకటించిన 5వ జాతీయ జలపురస్కారాల్లో దక్షిణాది రాష్ట్రాల్లో రాష్ట్రం నుంచి విశాఖపట్నం ఉత్తమ జిల్లాగా నిలిచింది. ఈ మేరకు నిన్న కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అవార్డులను ప్రకటించారు. అలాగే ఉత్తమ గ్రామ పంచాయతీల విభాగంలో అనంతపురం జిల్లాలోని హంపాపురం గ్రామం మూడో స్థానంలో నిలిచింది. ఉత్తమ నీటి వినియోగ సంస్థల విభాగంలో గుంటూరులోని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ 2వ స్థానం, విశాఖపట్నానికి చెందిన శ్రీ తిరుమల నగర్ రెసిడెంట్ సంక్షేమ సంఘం 3వ స్థానంలో నిలిచాయి. అలాగే తిరుపతి ఐఐటీకి ప్రత్యేక పురస్కారం లభించింది. ఈనెల 22న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విజేతలకు పురస్కారాలు

ప్రదానం చేయనున్నారు. ఉత్తమ రాష్ట్రాలుగా ఒడిశా, ఉత్తర్ ప్రదేశ్‌లు తొలి రెండు స్థానాలను పొందగా పుదుచ్చేరి, గుజరాత్ రాష్ట్రాలు మూడో స్థానంలో నిలిచాయి.

-----------------------------

అల్పపీడనం, భారీవర్షాల హెచ్చరికల నేపథ్యంలో ఆరు జిల్లాల్లో సహాయ, పునరావాస చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసింది. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలకు కోటి రూపాయల చొప్పున 6 కోట్ల రూపాయలను విడుదల చేస్తూ విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. వరద ప్రాంతాల్లో పునరావాస శిబిరాలు, తాగునీరు, ఆహారం, పాలు, ఆరోగ్య శిబిరాలు, పారిశుద్ధ్య చర్యలతో పాటు వరద బాధితులను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవాలని పేర్కొన్నారు. రహదారులపై చెట్లు పడిపోతే తొలగించేందుకు రహదారులు భవనాలు, పురపాలక, పంచాయతీరాజ్, రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం–ఎస్డీఆర్ఎఫ్ బృందాల సహకారం తీసుకోవాలని సూచించారు.

-----------------------------

ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో ప్రధానఘట్టమైన సిరిమానోత్సవం ఈరోజు జరగనుంది. ఈ కార్యక్రమంపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి విజయనగరం జిల్లా ప్రతినిధి కె.ఎన్ రామకృష్ణ అందజేస్తారు.

వాయిస్ (26 సెకన్లు)

మరోవైపు పైడితల్లి అమ్మవారిని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జి. సంధ్యారాణి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

-----------------------------

రాష్ట్రంలో 2 వందల కి.మీ. పొడవైన 13 రాష్ట్ర రోడ్ల అభివృద్ధికి కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి నుంచి 400 కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు కేంద్ర రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ సామాజిక మాధ్యమం వేదికగా వెల్లడించారు. గుంటూరు జిల్లాలోని గుంటూరు–నల్లపాడు రైల్వే మార్గంలో 98 కోట్లతో శంకర్ విలాస్ రోడ్డు ఓవర్ బ్రిడ్జి– ఆర్వోబీని 4 వరుసలతో నిర్మించడానికి ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను సేతు బంధన్ పథకంలో భాగంగా ఈ నిర్మాణాలను చేపట్టనున్నట్లు తెలిపారు.

-----------------------------

కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ప్రణాళికలను రూపొందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సంబంధిత శాఖల కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం నుంచి స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై దృశ్య మాధ్యమం ద్వారా జిల్లా కలెక్టర్లతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని 686 మండలాలకు గాను విజయనగరం, మచిలీపట్నం, నంద్యాల, ఒంగోలు, చిత్తూరు 5 అర్బన్ మండలాలు మినహా మిగతా మండలాలన్నిటిలో మండల విజన్ ప్రణాళికలు పూర్తి చేశారని చెప్పారు. అదే

విధంగా జిల్లాల ప్రణాళికలను త్వరతగతిన రూపొందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రముఖ శాస్త్రవేత్త, పూర్వ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజె అబ్దుల్ కలాం జయంతి ఈరోజు. తమిళనాడులోని రామేశ్వరంలో 1931 అక్టోబర్ 15వ తేదీన ఆయన జన్మించారు. ఇంటింటికీ పేపరు వేసే స్థాయి నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన అబ్దుల్ కలాం జీవితం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఆయన ప్రసంగాలు యువతకు జీవిత పాఠాలు. కలలు కనండి.. నిజం చేసుకోండి అంటూ పిల్లలకు, యువతకు అబ్దుల్ కలాం తన ప్రసంగాల ద్వారా స్ఫూర్తినిచ్చారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ–ఇస్రో, భారత రక్షణ పరిశోధనా, అభివృద్ధి సంస్థ–డిఆర్‌డివోలలో శాస్త్రవేత్తగా పనిచేసిన ఆయన.. అగ్ని, పృథ్వీలాంటి క్షిపణులను తయారుచేసి మిసైల్ మ్యాన్‌గా ప్రసిద్ధి చెందారు. అబ్దుల్ కలాం భారత రత్న సహా ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

మరోవైపు.. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయనకు నివాళులర్పించారు.

---------------------------

రాష్ట్రంలో ఈనెల 22, 23వ తేదీల్లో జరగనున్న అమరావతి డ్రోన్ సదస్సు–2024 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాను ఈ జాతీయ సెమినార్ నిర్వహణ భాగస్వామిగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. వాణిజ్య పరంగా డ్రోన్ల వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు ఈ జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు తెలిపింది. డ్రోన్ సిటీ ఏర్పాటుకు సంబంధించిన మార్గసూచిని ఈ సదస్సులో రూపకల్పన చేయనున్నామని, వ్యవసాయం, వైద్యారోగ్యం, పట్టణ ప్రణాళిక లు, శాంతి భద్రతలు, వస్తు ఉత్పత్తి రంగాల్లో డ్రోన్ల వినియోగంపై ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

---------------------------

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతూ ఈ రోజు తీవ్ర అల్పపీడనంగా బలపడనుందని . అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని ప పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో విద్యాసంస్థలకు ఆయా జిల్లాల కలెక్టర్లు సెలవులు ప్రకటించారు.

---------------------------

రాష్ట్రంతో పాటు ఎగువన మహారాష్ట్ర, తెలంగాణలో కురుస్తున్న వర్షాలతో కృష్ణా నదిలో వరద ప్రవాహం పెరుగుతోందని అధికారులు తెలిపారు. గత రాత్రి విజయవాడ ప్రకాశం బ్యారేజీకి 45వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరిందని, వరద నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు బ్యారేజీ అసిస్టెంట్ ఇంజనీర్ దినేష్ తెలిపారు. ఈ క్రమంలో కృష్ణా నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు నదిలో చేపల వేటకు వెళ్ల వద్దని అధికారులు ఒక ప్రకటనలో కోరారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2024- 2025 విద్యాసంవత్సరంలో 7, 10 తరగతుల్లోని ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం ఎడ్యుకేషనల్ ఎపిఫని సంస్థ ఏటా నిర్వహించే ప్రతిభా పరీక్ష నోటిఫికేషన్ వివరాలను రాష్ట్ర పాఠశాల విద్యశాఖ డైరెక్టర్ విజయ రామరాజు నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ పరీక్ష రెండు దశల్లో నిర్వహిస్తారని, ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుందని చెప్పారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పరీక్షలో విజేతలైన వారికి 9 లక్షల రూపాయల నగదు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 14 వరకు registrations2025.php వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.

---------------------------

రాష్ట్రంలో భూముల రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామ సభల నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.. రీ-సర్వేపై రైతుల్లో అవగాహన కల్పించాలని, డిసెంబరు 31లోగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లను ప్రభుత్వం ఆదేశించింది.

========================